క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెబినార్

అద్దంకి రూరల్: స్థానిక కట్టారామకోటేశ్వర రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోఈ నెల 4,5,6 తేదీల్లో విద్యా ఆధారిత అంతర్జాతీయ వెబినార్‌ను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి. మోహన్‌రావు శనివారం ఒక ప్రకటలో తెలిపారు. కళాశాల విద్యను అభ్యసించే ఏ విద్యార్థి అయినా రిజిస్ట్రేషన్ లింక్ ద్వారా ముందుగా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. విజేతలకు బహుమతులు, ప్రతిభా పత్రాలు అందజేస్తారని తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీతో గడువు ముగుస్తుందన్నారు.

క్రీడాదుస్తుల అందజేత


క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న దాత

అద్దంకి: పాఠశాల విద్యార్థులు ఆటల పోటీల్లోనూ జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాల్లో నిలవాలని పాఠశాల స్థల దాత నాడెండ్ల పూర్ణచంద్రరావు అన్నారు. మండలంలోని మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని క్రీడలకు వెళ్లే విద్యార్థులకు ఆయన శనివారం రూ.40 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను 50 మందికి పంపిణీ చేశారు. దాతను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు యస్. నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు వి. రమేష్, జి. శ్రీనావాసులు, వి. వెంకటరావు, జి. శ్రీను, పద్మావతి, పీడీ లావణ్య ఉన్నారు.

కారంచేడు తహసీల్దార్‌గా నాగరాజు


తహసీల్దారు నాగరాజును సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది


కారంచేడు: తహసీల్దారుగా జి. నాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు డిప్యూటీ తహసీల్దారు హోదాలో బాపట్ల కలెక్టర్ జి. మురళీకృష్ణకు సీసీగా వ్యవహరించారు. గత నెలలో నిర్వహించిన పదోన్నతుల్లో ఈయనను తహసీల్దారుగా నియమించారు. ఈ క్రమంలో కారంచేడు మండలానికి బదిలీ చేస్తూ ఉత్వర్వులు వచ్చాయి. ఇన్‌చార్జ్ తహసీల్దారుగా ఉన్న అనిత నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. రెవెన్యూ కార్యాలయ సిబ్బందితో పాటు, రేషన్ డీలర్ల అసోసియేషన్, వీఆర్‌ఏల సంఘం తరఫున ఘనంగా సత్కరించారు.

కృష్ణారావుకు నివాళి


అగ్నిగుండాల వెంకట కృష్ణారావు

పర్చూరు(చినగంజాం): పర్చూరు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకట కృష్ణారావు మృతి పట్ల రోటరీ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన అకాల మరణం పట్ల విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వెంకట కృష్ణారావు పర్చూరు రోటరీ క్లబ్ అనుబంధ సంస్థల అధ్యక్షునిగా పని చేసి రోటరీ క్లబ్ ప్రతిష్ఠను పెంచారని పలువురు కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో నేత్రదానం


దాత గొట్టిపాటి సుబ్బారావు

ఇంకొల్లు(చినగంజాం): బొల్లాపల్లి గ్రామంలో గొట్టిపాటి సుబ్బారావు (75) మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శనివారం శంకర కంటి వైద్యశాల వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. మృతుని భార్య లక్ష్మీరాజ్యం, కుమారులు ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, నాగమల్లేశ్వరిలను రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు(స్వామి), రోటరీ సభ్యులు అభినందించారు.

ఆక్రమణల తొలగింపు


మాట్లాడుతున్న తహసీల్దార్ పార్వతి

చీరాల: వేటపాలెంలోని సబ్‌స్టేషన్ వద్ద ఉన్న ఆక్రమణలను శనివారం తహసీల్దార్ పార్వతి తొలగించారు. వేటపాలెంలోని సర్వే నెంబర్ 370లోని 4.50 సెంట్ల భూమిలో విద్యుత్‌శాఖ, సిలోన్ కాలనీలోని ఉన్న తమిళ నివాసుల మధ్య కోర్టు వివాదం నడుస్తోందన్నారు. కాలనీ వాసులు చిన్న రేకుల షెడ్‌లు ఏర్పాటు చేసుకున్నారనే విద్యుత్‌శాఖ ఏఈ ఫిర్యాదు మేరకు తహసీల్దార్ పోలీస్‌సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. కాలనీవాసులు, విద్యుత్ శాఖ సిబ్బందితో మాట్లాడి ఆక్రమణలు తొలగించారు. అలానే ఈ భూమిలోకి ఎవరూ వెళ్లకుండా బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సంఘటనలో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా సమస్యను పరిష్కరించినట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు.

రహదారుణాలు


కోతకు గురైన ఇంకొల్లు గంగవరం రోడ్డు


నాగండ్ల గ్రామ పరిధిలో అధ్వానంగా ఉన్న రహదారి

- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న రోడ్ల నిర్మాణం
- వెంటాడుతున్న నిధులు కొరత
- ప్యాచ్ వర్క్‌లకే పరిమితమవుతున్న అభివృద్ధి

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు మండల పరిధిలోని.. రోడ్లు భవనాల శాఖ ఆధీనంలోని రోడ్ల గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. ఈ రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. గత కొన్నేళ్లుగా మండల పరిధిలోని ఆర్‌అండ్‌బీ రహదారులతో పాటు చుట్టు పక్కల మండలాలలు, అక్కడి గ్రామాలతో కలిపే రహదారులు సైతం అధ్వానంగా మారాయి. భారీ వాహనాల మాట ఎలా ఉన్నా కనీసం ద్విచక్రవాహనదారులకు, చిన్నపాటి వాహనాలు నడిపేందుకు కూడా అనుకూలంగా లేకుండా పోయాయి. రోడ్డు ప్రమాదాలకు లోనై పలువురు గాయాల పాలవుతుండగా మరికొందరు ప్రాణాలను సైతం పోగొట్టుకున్నారు. స్థానికంగా ప్రజలు పలుమార్లు అధికారులకు సమస్యను విన్నవించుకోగా తాత్కాలికంగా ప్యాచ్ వర్క్‌లు చేసి సరిపెడుతున్నారు.

ఇంకొల్లు నుంచి పంగులూరు వరకు.. ఇంకొల్లు నుంచి పర్చూరు, ఇంకొల్లు నుంచి నాగులప్పల పాడు, ఇంకొల్లు నుంచి గొల్లపాలెం వరకు, ఇంకొల్లు నుంచి గొల్లపాలెం మీదుగా చీరాల.. సంతరావూరు, వేటపాలెం రహదారులు మరింత దారుణంగా మారాయి. ఇక మండలంలోని గంగవరం రోడ్డు గడచిన ఏడు సంవత్సరాలుగా దుస్థితిలోనే ఉంది. రోడ్డు కోతకు గురవడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కాగా కోతకు గురైన ప్రాంతంలో తాత్కాలికంగా ఇసుక బస్తాలు ఏర్పాటు చేశారు. గంగవరం రోడ్డులో రహదారి కోత గురైన ప్రాంతంలో సైడు రిటైనింగ్ గోడలు కూడా ఏర్పాటు చేయలేక పోయారు. దీనివల్ల రహదారి పలుచోట్ల కుంగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతంలో రోడ్డు అభివృద్ధి సక్రమంగా జరగలేదన్నారు.

కాగితాలకే పరిమితమవుతున్న అధికారుల ప్రతిపాదనలు

రోడ్డు నిర్మాణాల కోసం ప్రజలు వినతులు చేసుకున్న మీదట అధికారులు.. ప్రతి పాదనలను ఉన్నతాధికారులు పంపుతున్నారు. ఇంకొల్లు- రహదారులు భవనాల శాఖ పరిధిలోని రహదారులు అభివృద్ధి చేయాలంటే నిధులు కొరత వెంటాడుతోందని.. ఆ శాఖాధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో రోడ్లను అభివృద్ధి చేయాలంటే నిధుల కొరత వెంటాడుతోందన్నారు. అందుకే ప్యాచ్ వర్క్‌లకోసం నిధులు మంజూరు చేస్తున్నారని ఏఈ శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా చీరాల డివిజన్ పరిధిలో నలుగురు ఏఈలు ఉండాల్సి ఉండగా ఒక్కరే అందరి బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోందని ఆయన తెలిపారు. దీనవల్ల పనిభారం ఎక్కువై.. పర్యవేక్షణ కొరవడుతోందన్నారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు మంజూరైనా నిధులు మంజూరు కాలేదని తెలియజేశారు. ఇంకొల్లు- పర్చూరు రహదారి మరమ్మతులకు ప్రతిపాదన పంపిస్తున్నామని చెప్పారు. అదే విధంగా ఇంకొల్లు గంగవరం రహదారి అభివృద్ధికి రూ. 23 కోట్లు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ నళినిని సాక్షి వివరణ కోరగా ప్రస్తుతం ఆర్‌అండ్‌బీని నిధులు కొరత వెంటాడుతోందని, దాంతో పూర్తి స్థాయిలో రోడ్లు నిర్మాణం చేయలేక పోతున్నామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్యాచ్ వర్క్‌లు నిర్వహిస్తున్నామని ప్రతి పాదనలు పంపి నిధులు మంజూరు అయిన వెంటనే రోడ్డు నిర్మాణాలను చేపడతామని చెప్పారు.

పట్టణ అభివృద్ధికి కృషి

- రెండు అంశాలు మినహా మిగిలిన అంశాలు ఆమోదం
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చ


కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల: పట్టణ అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అధ్యక్షతన జరిగింది. పట్టణ అభివృద్ధికి సంబంధించిన అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. వార్డుల్లో సిమెంట్ రోడ్లు, మురుగుకాలువల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. వార్డుల్లోని సమస్యలను వార్డు కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించనున్నట్లు వైస్ చైర్మన్ తెలిపారు. అనంతరం ఆజెండాలోని అంశాలపై కౌన్సిల్‌లో చర్చ నిర్వహించారు. ఒకటో అంశమైన పీఎస్‌ఆర్ కాంప్లెక్సు పక్కన గల ఖాళీ స్థలం లీజుకు ఇచ్చే విషయమై చర్చ జరగగా ఆ అంశాన్ని వాయిదా వేశారు. అలానే రెండో అంశంలోని ఎంజీసీ మార్కెట్ ఎదురు గల కాంప్లెక్సు లీజు విషయమై చర్చ జరిగింది. ఈ అంశాన్ని కూడా కౌన్సిల్ వాయిదా వేసింది. మొత్తం అజెండాలోని 15 అంశాల్లో రెండు అంశాలను తదుపరి కౌన్సిల్ సమావేశంలో చర్చిద్దామని రెండు అంశాలను వాయిదా వేయగా మిగిలిన అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి


మాట్లాడుతున్న అధికారులు, పాల్గొన్న వీఓఏలు

ఇంకొల్లు(చినగంజాం): బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని తిరిగి చెల్లించాలని వెలుగు డీపీఎం (బ్యాంక్ లింకేజ్) లక్ష్మణాచారి అన్నారు. ఇంకొల్లు వెలుగు కార్యాలయంలో శనివారం వీఓఏలకు లోకోస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. లోకోస్‌లో ఉన్న సంఘాలు, గ్రామ సంఘాలకు సంబంధించి ప్రొఫైల్‌ను యాప్‌లో ఎంట్రీ చేసేందుకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రుణాలను తిరిగి చెల్లించి సభ్యులంతా ఆర్థికంగా ఎదగాలన్నారు. ఐబీ ఏపీఎం రమేష్, స్త్రీ నిధి మేనేజర్‌లు పాల్గొనగా సీసీ మస్తాన్‌వలి, ఎన్. అనురాధ, జి. ఈశ్వర్ శిక్షణ ఇచ్చారు. ఇంకొల్లు, పర్చూరు, కారంచేడు, పంగులూరు మండలాలకు చెందిన వీఓఏలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీ


కొమ్మమూరు కాలువ వంతెన మీద ఢీకొన్న బస్సు-లారీలు

కారంచేడు: ఇంకొల్లు నుంచి వయా స్వర్ణ మీదుగా చీరాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, పర్చూరు వైపు నుంచి కంకర లోడుతో వస్తున్న నేషనల్ హైవే అథారిటీస్‌కు చెందిన టిప్పర్ లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అదృష్ట వశాత్తు ఎవరూ గాయపడలేదు. ఈ ఘటన శనివారం మండల కేంద్రమైన కారంచేడులో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. చీరాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చీరాల వయా కారంచేడు, స్వర్ణ మీదుగా ఇంకొల్లుకు షటిల్ సర్వీస్‌గా నడుస్తోంది. ఈ క్రమంలో బస్సు స్వర్ణ నుంచి కారంచేడు వరకు కొమ్మమూరు కాలువ కట్టమీద ప్రయాణించి కారంచేడు ఆంజనేయ స్వామి బొమ్మ వద్ద వాడరేవు-పిడుగురాళ్ళ ప్రధాన రహదారిని ఎక్కుతోంది. అదేసమయంలో పర్చూరు వైపు నుంచి కంకర లోడుతో వస్తున్న టిప్పర్ రోడ్డు క్రాస్ అవుతుండగా.. ఒక్క సారిగా రెండు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో బస్సులోని ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. మరికొద్ది వేగంగా వాహనాలు వచ్చి ఉండి ఉంటే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేది. వాహనాలు ఢీకొని ఆగి పోయాయని.. లేకుంటే పక్కనే ఉన్న కొమ్మమూరు కాలువలోకి దూసుకెళ్లేదని వారు చెబుతున్నారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 30 మంది వరకు ప్రయాణికులున్నట్లు సమచారం.

వాహనం ఢీకొని యాచకురాలు మృతి

మేదరమెట్ల: యాచకురాలు గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో మృతిచెందిన సంఘటన కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపునకు వెళ్ళే గుర్తుతెలియని వాహనం రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొంది. ఈ ప్రమాదంలో యాచకురాలు రెండు కాళ్ళు తీవ్రగాయాలు కాగా ఆమెను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.

మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మహిల వయస్సు సుమారు 50-55 సంవత్సరాలు ఉంటుందని చెప్పారు.

నేడు ఆధ్యాత్మిక ప్రవచనం

చీరాల రూరల్: స్థానిక పాపరాజుతోట స్వర్ణ రోడ్డులోని లయన్స్ క్లబ్ సర్వీస్ ట్రస్టులో ఆదివారం సాధన వంచకం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించనున్నట్లు ఆధ్యాత్మిక పీఠం అధ్యక్షుడు వి. వెంకట్రావు శనివారం తెలిపారు. ప్రవచ ఉపన్యాసకునిగా వేద విభూషణ, వేద కోవిదుడు గుంటూరు మనోహర్ వ్యవహరించనున్నారని తెలిపారు. జరీ నాగేశ్వరరావు, అన్నపూర్ణమ్మ చారిటీస్ వారు ప్రసాద శాశ్వత ఉభయదాతలుగా వ్యవహరించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష


పర్చూరు కోర్టులో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

పర్చూరు(చినగంజాం): పర్చూరు కోర్టులో మార్చి 8వ తేదీ నిర్వహించే లోక్ అదాలత్‌పై జూనియర్ సివిల్ జడ్జి పి. శాంతి పోలీసు సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి పోలీసులతో మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలని సూచించారు. అర్జీ దారులు, కక్షదారులతో చర్చలు జరిపి రాజీ అయ్యేలా కృషి చేయాలన్నారు.

బాలలు తక్కువ.. అధికారులు ఎక్కువ


అంగన్‌వాడీ కేంద్రంలో బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు పద్మావతి, అధికారులు

చినగంజాం: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి శనివారం మండల కేంద్రంలోని సోపిరాల అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఆ సందర్భంగా ఆమెకు ఆశ్చర్యకరమైన సంఘటన ఎదురైంది. కేంద్రం పరిశీలనకు వచ్చిన అధికారులు సంఖ్య కంటే కేంద్రంలోని చిన్నారుల సంఖ్య తక్కువగా కన్పించింది. దాంతో ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీడీఓ ఏ. శ్రీనివాసమూర్తి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి జి. శ్రీప్రియ, అంగన్ వాడీ సూపర్ వైజర్ వాణిశ్రీ, వీఆర్వో సత్యనారాయణ, వేణు పాల్గొన్నారు.

శ్రీశైలం వసతి గదుల నిర్మాణానికి వితరణ


ట్రస్టు నిర్వాహకులు మహాలక్ష్మికి నగదు అందజేస్తున్న దాతలు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల రూరల్: శ్రీశైలంలోని భక్తుల సౌకర్యార్థం వసతి గదులు నిర్మాణానికి ఎస్‌ఆర్‌అండ్‌వీఎం చీరాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చెక్క చెన్నునారాయణ, వంగర పూర్ణచంద్రరావు, గుద్దంటి రమేష్‌బాబు ఒక్కొక్కరు రూ. 25,116 మొత్తం రూ. 75,348 అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. స్థానిక ఎస్‌ఆర్‌అండ్‌వీఎం హైస్కూలు క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శ్రీ భ్రమరాంబిక సేవా సమితి ట్రస్టు చీరాల అధ్యక్షుడు.. ఎంవీఎస్ మహాలక్ష్మికి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్‌ల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు మహాలక్ష్మి మాట్లాడారు. శ్రీశైలం దేవస్థానం పరిధిలో చీరాలకు సంబంధించిన భక్తుల సౌకర్యార్థం వసతి గదులు నిర్మించుకునేందుకు శ్రీశైలం దేవస్థానం పరిధిలో 50 సెంట్ల స్థలాన్ని కేటాయించారన్నారు. అందుకుగాను దేవస్థానం వారు రూ. 50 లక్షల డిపాజిట్ కట్టాలని సూచించారన్నారు. ప్రస్తుతం రూ. 40 లక్షలు సమకూరాయని ఇంకా రూ. 10 లక్షలు కావాల్సి ఉందని చెప్పారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, గ్రంధి నారాయణమూర్తి, చెక్క చెన్నునారాయణ, వంగర పూర్ణచంద్రరావు, గుద్దంటి రమేష్‌బాబు, వీరాంజనేయులు, తిరుపతిరావు, సుబ్బారావు, రామారావు, శ్రీకృష్ణ, ప్రసాద్, భాస్కరరావు, రవి, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు


అభయాంజనేయ స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేస్తున్న భక్తులు

చీరాల టౌన్: మండలంలోని పిట్టువారిపాలెం గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న అభయాంజనేయస్వామి, పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం నూతనంగా ప్రతిష్ఠాపన చేయనున్న అభయాంజనేయ స్వామివారికి, పరివార దేవతల విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, వివిధ పూజలను పండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. పిట్టువారిపాలెంలో ఆదివారం నూతన అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా చేస్తున్నామని అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని గ్రామ పెద్దలు, విగ్రహ ప్రతిష్ఠ కమిటీ ప్రతినిధులు సూచించారు.

పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి


ఈపురుపాలెంలో పింఛన్ అందిస్తున్న ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు

చీరాల టౌన్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంలో లబ్ధిదారులకు పింఛన్లను ఆదివారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని చీరాల ఆర్డీవో, ప్రత్యేకాధికారి తూమాటి చంద్రశేఖర్ నాయుడు సూచించారు. శనివారం మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీలోని పలు వార్డుల్లో నగదు అందించారు. తోటవారిపాలెం గ్రామంలో పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ అవకతవకలు లేకుండా నివేదికలను సోమవారం మండల అధికారులకు సమర్పించాలన్నారు. తహసీల్దార్ కె.గోపీకృష్ణ, ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం, వీఆర్వోలు, పంచాయతీల సెక్రటరీలు, సచివాలయాల ఉద్యోగులున్నారు.

ఫీజు పోరుకు తరలిరండి


కొమ్మినేనివారిపాలెంలో మాట్లాడుతున్న కృష్ణబాబు

బల్లికురవ: కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ఈ నెల 5న వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పోరుకు తరలిరావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కొమ్మినేనివారి పాలెంలో పర్యటించి కార్యకర్తలు, గ్రామ నాయకులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికార కాంక్షతో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో పూర్తిగా విఫలం అయిందన్నారు. గ్రామ, గ్రామాన వీధి వీధికి మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తూ ఇచ్చిన హామీలను నెరవ్చేటంలో పూర్తిగా విఫలం అయ్యారన్నారు. మెగా డీఎస్సీ, తల్లికి వందనం వాయిదాలతోనే పరిమితం అయిందన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రైతులకు పెట్టుబడిసాయం, హామీలు కూడా ఇదిగో అదిగో అంటూ 7 నెలలు పూర్తి చేశారని చంద్రబాబు మోసపూరిత మాటలు విని మోసపోయారన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని గుర్తుచేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయనందున విద్యార్థులు తల్లిదండ్రులు నిత్యం మనోవేదనకు గురి అవుతున్నారన్నారు. పరీక్షల సీజన్ ఆరంభమవుతున్నందున ఫీజు చెల్లించలేదన్న వంకతో కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులను బయటకు గెంటుతున్నారని తెలిపారు. అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడటంలేదని కృష్ణబాబు అన్నారు. ఫీజు రియంబస్‌మెంటు కోసం జగన్‌మోహన్‌రెడ్డి పోరుబాటకు అండగా నిలుస్తూ తోడ్పాటు ఇవ్వాలన్నారు.

చిత్తడి నేలల పరిరక్షణ అందరి బాధ్యత


విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: భూమిపై ప్రాణికోటి మనుగడకు చిత్తడి నేలలే మూలమని బాపట్ల జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్ పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా శనివారం రాష్ట్ర ఎన్జీసీ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. జాండ్రపేటలోని బీవీఅండ్‌బీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. నీటి వనరులకు, మంచినీటికి మూలాలుగా ఉన్న చిత్తడి నేలలు భూమి ఉపరితలం నుంచి వ్యర్థాలను వడపోస్తున్నాయన్నారు. వీటిని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 2న వరల్డ్ వెట్ ల్యాండ్ డే నిర్వహిస్తారన్నారు. విచ్చలవిడిగా పెరిగిన రొయ్యలు, చేపల చెరువుల కారణంగా మడ అడవులు ధ్వంసం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల కోసం చిత్తడి నేలలను కేటాయించడంలో అవి మరింత విధ్వంసానికి గురవుతున్నాయన్నారు. అనంతరం వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు పెనుగొండ పూర్ణచంద్రరావు, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలతో ప్రాణాలు పదిలం


మాట్లాడుతున్న చీరాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణా రెడ్డి

మార్టూరు: ప్రజలు, ప్రయాణికుల క్షేమం కోసం భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని చీరాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రాజుపాలెం సమీపం లోని రెస్ట్ ఏరియాలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండటం, ఇన్సూరెన్స్ చేయించుకోవడం, హెల్మెట్ ధరించటం, మద్యం తాగి వాహనాలు నడపకుండా ఉండటం, కారులో సీటు బెల్టు ధరించటం వంటి భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. నేషనల్ హైవే రూట్ ఆఫీసర్ గిరిబాబు, బొల్లాపల్లి టోల్గేట్ ఆపరేషన్ మేనేజర్ శ్రీమన్నారాయణ, వివేకానంద, శ్రీనివాస విద్యాసంస్థల డైరెక్టర్లు వేలూరి కృష్ణమూర్తి, వీరగంధం శ్రీనివాసరావు, దివ్య ట్రాన్స్‌పోర్ట్ యజమాని కనుమూరి రాంప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.